సాక్షి
రంగారెడ్డి
మంగళవారం। 14। మే। 2024



కొత్తూరు: పోలింగ్ బూత్ దూరంగా ఉందంటూ నిరసన తెలుపుతున్న ఓటర్లు



అబ్దుల్లాపూర్‌మెట్: ఓటు వేసిన శతాధిక వృద్ధుడు



ఆమనగల్లు: ఓటు వేసినట్లు సిరాగుర్తు చూపిస్తున్న యువతులు



కడ్తాల్: ఓటు వేసేందుకు క్యూలో మహిళలు

న్యూస్‌రీల్

పూరీ బాగుంది



హిమాయత్‌నగర్‌లోని ఓ హోటల్‌లో పూరీ తింటున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం హిమాయత్ నగర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లోకి వెళ్లి యువకులను ఆప్యాయంగా పలకరించారు. ఇక్కడ ఏం స్పెషల్ అని అడుగగా యువకులంతా పూరీ స్పెషల్ సర్ అని చెప్పారు. వెంటనే నాకు కూడా పూరీ ఇవ్వండి అని ఆర్డర్ ఇచ్చి యువకులతో పాటు తిన్నారు. పూరీ బాగుంది అని హోటల్ సిబ్బందిని అభినందించారు.

1.50 కోట్ల మంది బస్సుల్లో ప్రయాణించారు

ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

గచ్చిబౌలి: తెలంగాణ వ్యాప్తంగా గడచిన గత రెండు రోజుల్లో 1.50 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు తమతమ స్వగ్రామాలకు తరలివెళ్లారని తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సి.సజ్జనార్ తెలిపారు. కొండాపూర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 5 వేల టీఎస్ఆర్టీసీ బస్సులను నడిపామని వివరించారు. ప్రస్తుతం వర్కింగ్ డేస్ కావడంతో వెళ్లిన వారంతా ఓటు వేసిన తర్వాత తిరిగి అదే రోజు తిరుగు ప్రయాణంలో కూడా వారికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలోని ఉప్పల్, ఎల్‌బీనగర్, ఆరాంఘర్, సంతోష్‌నగర్, లింగంపల్లి ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. ఆయా ప్రాంతాలలో ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేలా అన్ని టెంట్లు ఏర్పాటు చేసి వసతి కల్పించామని ఎండీ వివరించారు. రెండు రోజులుగా డ్రైవర్లు, కండక్టర్లు, ఆఫీసర్లు, సిబ్బంది చాలా కష్టపడ్డారని తెలిపారు. వారందరినీ యాజమాన్యం పక్షాన, సంస్థ పక్షాన అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. చాలా ఒత్తిడి ఉన్నా వారంతా ప్రయాణికుల శ్రేయస్సు కోసం చేసిన సేవలు మరువలేనివని వీసీ సజ్జనార్ కొనియాడారు.

అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

హైదరాబాద్: అత్యధిక లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సదానంద్ అన్నారు. ఓటర్లంతా కాంగ్రెస్ పక్షాన ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... ఓటింగ్ సరళి చూసిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 12–14 స్థానాలు లభించే అవకాశం ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేసిన నేపథ్యంలో లబ్ధి పొందుతున్న ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ తెరవెనుక ఒప్పందాలు కుదుర్చుకొని కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ఓటర్లు మాత్రం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని ఆయన స్పష్టం చేశారు.

పోలింగ్ ఎందుకు తగ్గింది..?

- వరుస సెలవులతో లక్షలాదిగా సొంత ఊళ్లకు తరలిన జనం
- గ్రేటర్‌లో ఓటువేసేందుకు అనాసక్తి!

సాక్షి, సిటీబ్యూరో: ఎండలు నిప్పులు చెరగలేదు. వడగాలులు వీచలేదు. వడగండ్ల వానలు లేనేలేవు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగర వాతావరణం చల్లగానే ఉంది. ఆహ్లాదంగానే ఉంది. కానీ పోలింగ్ మాత్రం మందకొడిగానే సాగింది. ప్రతి ఎన్నికల్లో నమోదైనట్లుగానే సాయంత్రం ఐదింటి వరకు 50 శాతం లోపే ఓట్లు పోలయ్యాయి. సాధారణంగా ఈసారి ఎండల కారణంగా సిటీలో ఓటింగ్ తగ్గవచ్చునని విశ్లేషకులు భావించారు. కానీ అందుకు భిన్నంగా వాతావరణం సహకరించింది. అయినప్పటికీ ఓటింగ్ ఆశించిన స్థాయిలో పెరగలేదు. నగర వాసులు పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలి వెళ్లడం వల్లనే ఈ సారి ఓటింగ్ శాతం తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏపీలో లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండటంతో ఆ రాష్ట్రానికి చెందిన నగర వాసులు లక్షలాదిగా తరలి వెళ్లారు. నగరంలో ఓటింగ్ శాతం పెరగకపోవడానికి ఇది ప్రధాన కారణం. అదే సమయంలో తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన నగర వాసులు కూడా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పెద్ద సంఖ్యలోనే సొంత ఊళ్లకు వెళ్లారు. వేసవి సెలవుల కారణంగా చాలా మంది ఇంటిల్లిపాది కలిసి పర్యాటక ప్రాంతాలకు, సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. ఓటింగ్ తక్కువగా నమోదు కావడానికి వేసవి సెలవులు కూడా కారణమే.

మందకొడిగా..

మధ్యాహ్నం తర్వాత ఊపందుకున్న ఓటింగ్

- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉన్న గ్రామాల్లో ఓటర్ల నిరసన
- ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- చేవెళ్లలో అత్యధికం.. శేరిలింగంపల్లిలో అత్యల్పం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. అప్రమత్తమైన అధికారులు వెంటనే అప్పటికే రిజర్వ్‌లో ఉంచుకున్న ఈవీఎంలను వాటి స్థానంలో ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా కందుకూరు మండలం తిమ్మాపూర్ అనుబంధ గ్రామం చీమలవానికుంట పాటు కొత్తూరు మండలం కోడిచర్ల తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై ఆయా గ్రామాల ఓటర్లు ఆందోళనకు దిగారు. ఎన్నికల అధికారులు సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఇక చేవెళ్ల లోక్‌సభ స్థానంలో ఓటర్లు పోటెత్తారు. ఉదయం మందకొండిగా ప్రారంభమైన పోలింగ్.. మధ్యాహ్నం తర్వాత ఊపందుకుంది. మహిళలు, వృద్ధులు, రైతులు, కూలీలు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9గంటల వరకు 8.34 శాతం ఓటింగ్ నమోదు కాగా, 11 గంటల వరకు 20.23 శాతం, మధ్యాహ్నం ఒంటిగంట వరకు 34.56 శాతం ఓటింగ్ నమోదైంది. 3 గంటల వరకు 45.35 శాతం ఓటింగ్ నమోదు కాగా, సాయంత్రం 5 గంటల వరకు అత్యధికంగా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 68.23 శాతం ఓటింగ్ నమోదు కాగా, అత్యల్పంగా శేరిలింగంపల్లిలో 41.07 శాతం నమోదయ్యింది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదయ్యింది.

మొరాయించిన ఈవీఎంలు

మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలోని 142 పోలింగ్ కేంద్రంలో కొద్దిసేపు ఈవీఎం మొరాయించింది. కాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి ఇదే పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. బడంగ్‌పేటలోని 235, 237 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలు సైతం మొరాయించడంతో అక్కడ 50 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కేశంపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి పోలింగ్‌బూత్ 112లోని ఈవీఎం పనిచేయకపోవడంతో అధికారులు మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని 247 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో ఇక్కడ పోలింగ్ కొద్దిగా ఆలస్యమైంది. ఫరూక్‌నగర్ మండలం పీర్లగూడలోని ఓ పోలింగ్ కేంద్రంలోని ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లోని 225 బూత్‌లో ఈవీఎం దాదాపు 40 నిమిషాల పాటు మొరాయించింది. ఫరూక్‌నగర్ మండలం ఎలికట్టలోని 169 పోలింగ్ బూత్‌లోని ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు చాలాసేపే క్యూలైన్లో వేచి ఉండాల్సి వచ్చింది. అయితే పలు కేంద్రాల్లో తమ ఓట్లు గల్లంతయ్యాయని ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటిసారి ఓటువేసేందుకు యువత ఉత్సాహం చూపారు. ట్రాన్స్‌జెండర్లు కూడా క్యూలో నిల్చొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాగా ఈవీఎంలు మొరాయించిన చోట క్యూలో ఎక్కువ సేపు నిలబడాల్సి ఉండటంతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు.

చేవెళ్ల లోక్‌సభ స్థానంలో ఓటింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ నియోజకవర్గం	ఉదయం 9గం	మ.1గం	మ.3గం	సా.5 గంటలకు	రా.7గంటలకు
మహేశ్వరం	7.26	31.84	41.23	49.77	51.70
రాజేంద్రనగర్	7.12	31.49	42.15	50.54	53.13
శేరిలింగంపల్లి	6.59	27.49	35.55	41.07	43.11
చేవెళ్ల	10.31	43.11	58.62	68.23	70.84
పరిగి	11.38	43.57	56.36	62.59	65.98
వికారాబాద్	10.37	45.16	57.63	66.86	69.44
తాండూరు	11.85	41.05	54.95	63.00	66.34
మొత్తం	8.34	34.56	45.35	53.15	60.07 (అంచనా)

షాద్‌నగర్, మహేశ్వరంలో నిరసనలు

కందుకూరు మండలం తిమ్మాపూర్ అనుబంధ గ్రామం చీమలవాని కుంటకు పోలింగ్ కేంద్రం రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేశారు. అంత దూరం మేం పోలేమని చీమలవాని కుంట ఓటర్లు నిరసనకు దిగారు. అధికారులు నచ్చజెప్పడంతో చివరకు వారు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం కొత్తూరు మండల పరిధిలోని కొడిచర్ల తండావాసులు స్థానికంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకుండా నాలుగు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు తండాకు చేరుకుని నచ్చజెప్పడంతో చివరకు వారు శాంతించి ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ఓటేసిన ప్రముఖులు

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి కొకుంట్లలో ఓటేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఖానాపూర్‌లో, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తొర్రూర్‌లో, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వీర్లపల్లిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బడంగ్‌పేట మేయర్ పారిజాత, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే టీకేఆర్ తమ ఓటుహక్కును వినియోగించున్నారు.

మెజార్టీ సీట్లు సాధిస్తాం



లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి మెజార్టీ సీట్లు సాధిస్తుందని భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పసుమాములలో ఆయన ఓటుహక్కును వినియోగించుకున్నారు. మరోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

– బూర నర్సయ్యగౌడ్, భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి

బీఆర్ఎస్‌దే విజయం



భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఇబ్రహీంపట్నం మండలంలోని తన స్వగ్రామం శేరిగూడలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం అని స్పష్టం చేశారు. భువనగిరి ఎంపీ స్థానంలో గెలిచి బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు కానుకగా ఇస్తానన్నారు.

– క్యామ మల్లేశ్, భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి

ప్రజలు కాంగ్రెస్ వైపే..



ఓటర్ల ఆశీర్వాదంతో తప్పక గెలుస్తానని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ ఎన్కెపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని.. తప్పక విజయం సాధిస్తాను. కేంద్రంలోనూ అధికారంలోకి వస్తాం.

– రంజిత్‌రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

బీజేపీ జెండా ఎగరేస్తాం



ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన తన స్వగ్రామం ధర్మసాగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల గడ్డపై తప్పకుండా బీజేపీ జెండా ఎగురవేస్తాం. మరోసారి మోదీ ప్రధానమంత్రి అవుతారు.

– చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



పోలింగ్ సామగ్రితో గొల్లపల్లిలోని రిసీవింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

ఓవర్ టు రిసీవింగ్ సెంటర్

- ఓట్ల అనంతరం పోలింగ్ సామగ్రితో తిరిగి వచ్చిన సిబ్బంది
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ఈవీఎం, వీవీ ప్యాట్ల అప్పగింత ప్రక్రియ



చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో సోమవారం రాత్రి పోలింగ్ కేంద్రాల నుంచి అధికారులు, సిబ్బంది పోలింగ్ యంత్రాలు, సామగ్రితో రిసీవింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. అయితే ఈసారి పోలింగ్ సమయం సాయంత్రం 6గంటల వరకు పెట్టడంతో పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి యంత్రాల ప్యాకింగ్, పోలైన ఓట్ల లెక్కలు సరిచేసుకునేసరికి రాత్రి అయ్యింది. అక్కడి నుంచి సెక్టార్ల వారీగా వచ్చే బస్సుల్లో ఎక్కి చేవెళ్ల మండలంలోని గొల్లపల్లి సమీపంలోని బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన రిసీవింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అక్కడ అధికారులు ముందస్తుగా సెక్టార్ల వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో పోలింగ్ బూత్‌వారీగా ఈవీఎంలు, వీవీప్యాట్‌ల యంత్రాలు, ఎన్నికల సామగ్రిని అప్పగించారు. చేవెళ్ల అసెంబ్లీ పరిధిలోని ఐదు మండలాల నుంచి అంతా ఇక్కడికే రావాల్సి రావడంతో ఉద్యోగులకు అర్ధరాత్రి దాటింది. దీంతో ఎన్నికల సామగ్రిని అప్పగించి తిరిగి వారివారి ఇళ్లకు వేళ్లేందుకు ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ముందస్తుగానే వ్యక్తిగత వాహనాలు ఏర్పాటు చేసుకున్న వారు ఇళ్లకు చేరుకోగా ఆలస్యమైన వారు ఇబ్బంది పడ్డారు. పోలింగ్ కేంద్రాలనుంచి వచ్చే ఉద్యోగులకు రిసీవింగ్ కేంద్రం వద్ద భోజన వసతిని కల్పించారు.

ఎవరి ధీమా వారిదే..

- కాంగ్రెస్, బీజేపీల మధ్యే ప్రధాన పోటీ!
- చివరి నిమిషంలో చేతులెత్తేసిన బీఆర్ఎస్
- బూత్‌ల వారీగా ఓటింగ్ సరళిపై ఆరా..



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల్లో గెలుపుపై ఎవరికీ వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగిన ఓటింగ్ సరళిని బట్టి చూస్తే చేవెళ్ల లోక్‌సభ స్థానంలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ కన్పిస్తోంది. నేనే గెలవబోతున్నానని ఒకరు అంటే..కాదు నేనే గెలుస్తానంటూ మరొకరు ధీమాగా ఉన్నారు. మైనార్టీల, మహిళల ఓట్లు గంపగుత్తగా తమకే పడ్డాయని.. ఈ ఓట్లు తమను గట్టెక్కిస్తాయని కాంగ్రెస్ చెబుతుండగా, ఐటీ ఉద్యోగులు, యువత, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న చిరుద్యోగులు, పట్టణ ఓటర్లు కమలం వైపు మొగ్గుచూపినట్లు ఆ పార్టీ చెబుతోంది. బీఆర్ఎస్ ఓటుబ్యాంకు కూడా బీజేపీ వైపు మళ్లిందని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముస్లిం రిజర్వేషన్ల ఎత్తివేత అంశం సహా ఆరు గ్యారంటీల హామీ, సీఎం రేవంత్‌రెడ్డి సుడిగాలి పర్యటనలు కాంగ్రెస్‌కు కలిసివస్తాయని ఆ పార్టీ భావిస్తోంది. దీనికితోడు చివరి నిమిషంలో నిర్వహించిన పోల్‌మేనేజ్‌మెంట్ కూడా ఇందుకు దోహదం చేస్తుందని వారు ధీమాగా ఉన్నారు. ఇదిలా ఉంటే గత రెండు ఎన్నికల్లోనూ హవా కొనసాగించిన బీఆర్ఎస్ ఆఖరి నిమిషంలో చేతులెత్తేసింది. బీసీ కార్డు ఆశించిన స్థాయిలో పనిచేయకపోగా, మెజార్టీ మండలాల్లో బీఆర్ఎస్ ఓట్లు కూడా బీజేపీకి డైవర్ట్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం పరిధిలోని షాద్‌నగర్‌లోనూ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. షాద్‌నగర్ పట్టణం సహా గ్రామీణ ప్రాంతాలు సైతం బీజేపీ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇక భువనగిరి లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన క్యామ మల్లేశ్ జిల్లా వాసి అయినప్పటికీ ఆఖరి నిమిషంలో ఆయన కూడా చేతులెత్తేసినట్లు తెలిసింది. బీఆర్ఎస్ కేడర్‌లో చీలిక వచ్చి.. కొంతమంది కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా, మరికొంత మంది బూర నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా నిలిచినట్లు తెలుస్తోంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని ఎల్బీనగర్‌లోని మెజార్టీ ఓటర్లు కమలం వైపు మొగ్గు చూపినట్లు తెలిసింది. దీంతో ఆ పార్లమెంట్ స్థానంలో బీజేపీ నుంచి పోటీలో ఉన్న ఈటల రాజేందర్ గెలుపు దాదాపు ఖాయమేనని ఆ పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి. ఇక నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని కల్వకుర్తిలోనూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ ఎవరికి వారు గెలుపుపైధీమా వ్యక్తం చేస్తున్నారు.

మీర్‌పేటలో టెన్షన్ టెన్షన్

- డబ్బులు పంచుతున్నారంటూ కాంగ్రెస్ నేతలతో బీజేపీ శ్రేణుల ఘర్షణ
- టెంట్లు ధ్వంసం, రోడ్డుపై బైఠాయించి నిరసన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ



నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ సిర్లాహిల్స్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ నాయకులు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించడంతో ఇరువర్గాల నేతలు ఒకరినొకరు దూషించుకున్నారు. అక్కడ ఉన్న టెంట్లను ధ్వంసం చేశారు. ఓటర్లకు డబ్బులు ఎలా పంపిణీ చేస్తారంటూ బాహాబాహీకి దిగారు. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరుపార్టీల నాయకులను సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

ఈవీఎంల మొరాయింపు

బడంగ్‌పేట్ పరిధిలో

ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్

బడంగ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా సోమవారం బడంగ్‌పేట మున్సిపాలిటీలోని 235, 237 పోలింగ్ బూతులను స్థానికంగా ఉన్న శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ ప్రక్రియ ఈవీఎంలు మొరాయించడంతో రెండు చోట్ల 50 నిమిషాలు ఆలస్యంగా మొదలయ్యాయి. టెక్నీషియన్ వచ్చి మరమ్మతు చేసేవరకు ఓటర్లు క్యూలైన్‌లోనే పడిగాపులు కాశారు. అనంతరం వారు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాలాపూర్ మండలంలోని అల్మాస్‌గూడ, బాలాపూర్, నాదర్‌గుల్, వెంకటాపూర్, మామిడిపల్లిలో పరిధిల్లోని పోలింగ్ బూత్‌ల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కు బాధ్యతే..



కాలికి వేసిన సిరాను చూపుతున్న కృష్ణయ్య

కేశంపేట: ఎన్నికల సంఘం ఎన్నిఅవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఓటర్లు వంద శాతం పోలింగ్‌కు సహకరించడం లేదు. శరీరంలో అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న వారే పోలింగ్ కేంద్రాలకు రాక బాధ్యతను మరుస్తున్నారు. కానీ మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన కృష్ణయ్య అంగ వైకల్యాన్ని లెక్క చేయకుండా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన కొద్దిరోజులు క్రితం విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులను పోగొట్టుకున్నారు. సార్వత్రిక సమరంలో భాగంగా కృష్ణయ్య సోమవారం సహాయకురాలుగా భార్య జయమ్మను కేంద్రానికి తీసుకువెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసిన వ్యక్తికి రెండు చేతులు లేకపోవడంతో అధికారులు ఆయన కాలికి ఇంకును వేశారు.

షాద్‌నగర్.. పోలింగ్ ప్రశాంతం



కిషన్‌నగర్‌లో వృద్ధురాలికి తీసుకెళ్తున్న కానిస్టేబుల్

- కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు

షాద్‌నగర్, షాద్‌నగర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ నిర్వహించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, నందిగామ నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎండల నేపథ్యంలో షాద్‌నగర్ పట్టణంతో పాటుగా పలు గ్రామాల్లో ఉదయం 6.30 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు వచ్చారు. సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత అధికారులు పోలింగ్ కేంద్రానికి సంబంధించిన గేట్లను మూసి వేశారు. పోలింగ్ కేంద్రానికి సమయానికి వచ్చిన వారిని అధికారులు ఓటు వేసేందుకు అనుమతించారు.

ఆలస్యంగా పోలింగ్

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని పీర్లగూడ, ఎలికట్ట, షాద్‌నగర్ పట్టణంలోని 247 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. పీర్లగూడలో ఈవీఎం మొరాయిచడంతో పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభం అయ్యింది. అదేవిధంగా ఎలికట్టలో పోలింగ్ మధ్యలోనే ఈవీఎం మొరాయించడంతో ఓట్లు వేసేందుకు వచ్చిన వారు కొందరు పోలింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగారు. దీంతో సుమారు 40 నిమిషాల పాటు పోలింగ్ నిలిచింది. అనంతరం అధికారులు ఈవీఎంలను సరి చేశారు.

ప్రముఖుల సందడి

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తన స్వగ్రామమైన దూసకల్ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. షాద్‌నగర్ పట్టణంలోని వెంకటేశ్వర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పరిశీలించిన డీసీపీ

ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్ ఉన్న పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి పరిశీలించారు.



కిషన్‌నగర్‌లో ఓటు వేసేందుకు లైన్‌లో నిలబడిన మహిళలు



కంసాన్‌పల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న గ్రామస్తులు

కొడిచర్లతండా ఓటర్ల నిరసన



కందుకూరు: ఓటు వేయకుండా రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఓటర్లు



కొత్తూరు: ఓటర్లతో చర్చిస్తున్న పోలీసులు, ఎన్నికల అధికారులు

- పోలింగ్ కేంద్రం, రేషన్ షాపు కోసం రోడ్డుపై బైఠాయింపు
- అధికారుల హామీతో సద్దుమణిగిన వ్యవహారం

కొత్తూరు: తమ సమస్యలను పరిష్కరించాలని లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వేళ కొత్తూరు మండలం కొడిచర్ల తండా ఓటర్లు ఆందోళన చేపట్టారు. నూతనంగా ఏర్పడిన తమ గ్రామ పంచాయతీలో పోలింగ్ కేంద్రం, రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసే వరకు ఓటు వేయబోమని సోమవారం నిరసనకు పూనుకున్నారు. ఓ వైపు పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండడం.. తండా ఓటర్లు పోలింగ్ కేంద్రానికి సమీపంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో అధికారులు వెంటనే స్పందించారు. మండల ఎన్నికల అధికారులు, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు ఓటర్లు తమ సమస్యలను వారికి విన్నవించారు. తండా నుంచి పోలింగ్ కేంద్రం సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. తండా పంచాయతీగా రూపాంతరం చెందిన తర్వాత కూడా రేషన్ దుకాణం ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రతినెలా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొడిచర్ల గ్రామానికి వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తుందని వాపోయారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా తండాలోనే రేషన్ దుకాణం, పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆసహనం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు తండావాసుల సమస్యను ఉన్నతాధికారులకు నివేదించారు. త్వరలోనే రేషన్ దుకాణం ఏర్పాటుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో తండావాసులు ఆందోళన విరమించారు. అనంతరం వారికి వాహనాలు ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రానికి వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు.



కందుకూరు: ఆందోళన తెలుపుతున్న వృద్ధులు

పోలింగ్ బూత్ ఏర్పాటుకు నిరసన

కందుకూరు: తమ గ్రామంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని గతంలో ఎన్నిసార్లు వినతులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో మండల పరిధిలోని తిమ్మాపూర్ అనుబంధ గ్రామం చీమలవానికుంట ఓటర్లు నిరసన చేపట్టారు. ఈ మేరకు ఓటు వేయకుండా సోమవారం గ్రామంలోనే బైఠాయించారు. చీమలవానికుంట గ్రామం తిమ్మాపూర్ నుంచి దాదాపుగా మూడు కిలోమీటర్ల మేర దూరంలో ఉంటుంది. దాదాపుగా 350 మంది వరకు ఓటర్లు ఉన్నారు. కాగా పోలింగ్ బూత్‌ను గతంలో తమ గ్రామంలోనే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతులు చేసినా ఉపయోగంలేదు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో సైతం చీమలవానికుంట ఓటర్లకు తిమ్మాపూర్‌లోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడి నుంచి మూడు కిలోమీటర్ల మేర దూరంలో ఉన్న పోలింగ్ బూత్‌కు 350 మంది వరకు ఓటర్లు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలి. దీంతో వారు సోమవారం ఉదయం 8 గంటల నుంచి గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ఓటు వేయమంటూ నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డితో పాటు ఎన్నికల అధికారులు వారి వద్దకు వెళ్లి భవిష్యత్ ఎన్నికల్లో పోలింగ్ బూత్ ఇక్కడే ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిరసన విరమించి సొంత వాహనాల్లో ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కు తరలివెళ్లారు.

మొదటిసారి.. నవతరం గురి

ఓటు వేసేందుకు కదిలిన యువత

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది ఎంతో కీలకం. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు భారత ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పిస్తుంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత సంతోషాన్ని వ్యక్తం చేశారు. చట్టసభల్లో ప్రజాప్రతినిధిని తొలిసారి ఎన్నుకునే అవకాశం రావడంతో కొత్త ఓటర్లు ఆనందాన్ని పంచుకున్నారు.

స్వేచ్ఛగా ఓటు వేశాను



ఈ సారి నాకు కొత్తగా ఓటు వచ్చినందుకు సంతోషంగా ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చి మంచి నాయకుడిని ఎన్నుకున్నాను. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా నా బాధ్యతను నిర్వర్తించాను.

– శ్వేత, కిషన్‌నగర్, షాద్‌నగర్

ఎంతో సంతోషంగా ఉంది



ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉంది. ఓటు హక్కు పొంది మొదటిసారిగా ఓటు వేసినందుకు చాలా సంతోషంగా ఉంది. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నాను. ప్రజాస్వామ్యం కాపాడే విలువలున్న నాయకుడికే ఓటేశాను.

– ఐశ్వర్య, ఎలికట్ట, ఫరూఖ్‌నగర్

తొలిసారి.. ఓటరుగా మారి



ఓటు హక్కు వచ్చిన తరువాత తొలిసారి ఓటు వేశాను. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో విలువైనది. అలాంటి ఓటును తొలిసారి వినియోగించుకున్నాను. మొదటిసారి ఓటు వేయడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని స్వేచ్ఛగా ఎన్నుకోవాలని కోరుతున్నాను.

– సదాఫ్, విద్యార్థిని, ఆమనగల్లు

నా ఓటు మార్పునకు నాంది



నేను మొదటిసారి ఓటు వేసి నా ఓటు హక్కును వినియోగించుకున్నా. ఎవరెన్ని చెప్పినా బాధ్యతగా నాకు నచ్చిన అభ్యర్థికి ఓటువేశా. అభివృద్ధి చేసే నాయకుడు గెలుపొందుతారని కోరుకుంటున్నా. యువతలో మార్పు రావాలి. ఎన్నికల్లో గెలిపొందిన వారు స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. సమాజంలో మార్పు తీసుకురావాలి.

– పూర్ణచందర్‌రావు, తాళ్లపల్లి, షాబాద్

ఓటు వేసిన మాజీ మంత్రి



ఓటు వేసిన అనంతరం దేవేందర్‌గౌడ్, ఆయన కుటుంబ సభ్యులు

తుక్కుగూడ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో మాజీ హోంశాఖ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామంలో ఓటు అత్యంత విలువైన ఆయుధమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

బార్డర్ దాటారంటూ..

పర్వేద పోలింగ్ కేంద్రం వద్ద స్వల్ప లాఠీచార్జి

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 72.14శాతం పోలింగ్ నమోదైంది. మాసానిగూడలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ గ్రామస్తులతో కలిసి ఓటు వేశారు. అక్కడే గ్రామస్తులతో కలిసి ఓటింగ్ తీరును చర్చించారు. మండలంలోని పర్వేద పోలింగ్ కేంద్రం వద్ద పలు రాజకీయ పార్టీల నాయకులు ఒక్కసారిగా గుమ్మిగూడి పోలీసులు నిర్దేశించిన బార్డర్ దాటి వచ్చారు. దీంతో పోలీసులు వారిని దూరంగా పోవాలని చెప్పినా వినకపోవటంతో శంకర్‌పల్లి డీఐ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సిబ్బందితో కలిసి లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. దీంతో వారంతా ఆందోళన చేశారు. దీంతో కాసేపు స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని దీనిని ఎవరు అతిక్రమించవద్దని హెచ్చరించారు. ఈ విషయాన్ని చెప్పకుండా పోలీసులు లాఠీచార్జి చేయటం సరైనది కాదని మండిపడ్డారు. పోలీసులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పోలింగ్ కోసమే వచ్చామని ఇలా కొట్టడమేమిటని ప్రశ్నించారు. పలువురు నాయకులు, పోలీసులు సర్ది చెప్పటంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు.

బతికున్న ఆమెను చంపేశారు

కుమారుడి నిలదీతతో ఓటు వేయించిన అధికారులు



ప్రత్యేక అనుమతితో ఓటు వేసిన పద్మమ్మ

షాద్‌నగర్: బతికున్న ఆమెను చంపేశారు.. చనిపోయిన ఆమెకు మాత్రం ఓటరు జాబితాలో చోటు కల్పించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం షాద్‌నగర్‌లో కనిపించిన విచిత్రాలు ఇవి. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని గంజ్‌లో ఏర్పాటు చేసిన 227 పోలింగ్ బూత్‌లో పట్టణంలోని పటేల్‌రోడ్డుకు చెందిన పద్మమ్మ (70) ఓటు వేసేందుకు ధ్రువీకరణ కార్డును తీసుకొని పోలింగ్ కేంద్రానికి వచ్చింది. అయితే ఆమె చనిపోయినట్లు ఓటరు జాబితాలో ఉందని అధికారులు చెప్పడంతో ఖంగుతిన్నారు. వెంటనే విషయాన్ని తెలుసుకున్న పద్మమ్మ కుమారుడు రవి ఎన్నికల సిబ్బంది వద్దకు వెళ్లి ప్రశ్నించారు. ఆమె బతికే ఉన్నట్లు నిర్ధారించుకున్న సిబ్బంది ప్రత్యేక అనుమతి ద్వారా ఓటు వేయించారు. అదేవిధంగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య అత్త చంద్రమ్మ గత కొన్నేళ్ల క్రితమే చనిపోయారు. కానీ ఓటరు జాబితాలో మాత్రం ఆమెకు ఓటు ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు అవాక్కయ్యారు.

'ఎన్నికల్లో డబ్బు పంచడం బాధాకరం'

మేడ్చల్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బు పంచే చరిత్ర ఎప్పుడూ లేదని, ఈ సారి ఇతర పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో కూడా డబ్బులు పంచడం, ప్రలోభాలకు గురి చేయడం చాలా బాధాకరమని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మండలం పూడూర్ గ్రామంలో తన ఓటు హక్కు వినియోగించుకున్న ఈటల అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశమంతా ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ అనే నినాదం వస్తోందని, ఆ నినాదానికి అనుగుణంగా ధర్మ రక్షణకు, దేశ రక్షణకు, దేశ పురోగమనానికి మద్దతు ఇచ్చే ఓటుగా భావించాలన్నారు.

అకాల వర్షం.. రైతన్నకు కష్టం



కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల నుంచి వరదనీటిని తొలగిస్తున్న రైతులు



బెన్నూరు కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

యాలాల: మండల పరిధిలో సోమవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. దీంతో బెన్నూరు గ్రామ శివారులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన వరి ధాన్యం పూర్తిగా తడిసింది. కొందరు రైతులు కవర్లు కప్పి ఉంచినప్పటికీ, ధాన్యం రాశుల కిందకు వరదనీరు చేరింది. దీంతో ఆ నీటిని దిగువకు పారించేందుకు రైతులు అవస్థలు పడ్డారు. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

ముచ్చటైన 'ఎన్నికల' పందిరి!

బంజారాహిల్స్: పచ్చని పందిరి.. పూల తోరణాలు.. ఫొటో బూత్‌లు... చల్లని నీరు... ఇవన్నీ ఏదో శుభకార్యంలో కనిపించాయని అనుకుంటే పొరబడినట్లే. ఇవన్నీ సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కొన్ని ఎంపిక చేసిన పోలింగ్ బూత్‌లలో కనిపించిన దృశ్యాలు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎంపిక చేసిన పోలింగ్ బూత్‌లను మోడల్ పోలింగ్ బూత్‌లుగా మార్చేందుకు అధికారులు రచించిన ప్రణాళికలు విజయవంతం అయ్యాయి. సఖి, యువ, ఆదర్శ పేరుతో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయా పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లతో ఓ మంచి ఫీల్‌ను అధికారులు ఓటర్లకు తీసుకొచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫొటో బూత్‌లలో ఓటర్లు ఫొటోలు తీసుకొని తమ సోషల్ మీడియాల్లో పోస్టు చేసుకున్నారు.



ప్రశాసన్‌నగర్‌లో...



ఓబుల్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌లో ఇలా...

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు

దౌల్తాబాద్: మండలంలోని బిచ్చాల గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌గౌడ్(20), భాస్కర్, రవిలు ఓకే బైక్‌పై కోస్గి పట్టణానికి స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ముశ్రీఫా గ్రామ సమీపాన బైక్ అదుపు తప్పి ఓ చెట్టుకు ఢీకొట్టడంతో విష్ణువర్ధన్‌గౌడ్ అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు హైదరాబాద్‌లో ఓ కంపెనీలో పనిచేస్తుండేవారు. రెండు నెలలుగా ఇంటి దగ్గరనే ఉంటున్నారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటిపోయాయి. బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కోస్గి ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలు కింద పడ్డారని..

అద్దె బస్సు అద్దం ధ్వంసం చేసిన స్థానికులు



పగులగొట్టిన బస్సు అద్దం

యాలాల: మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్‌లో సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ అద్దె బస్సు అద్దాలను కొందరు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు డిపో నుంచి ఓ ఆర్టీసీ అద్దె బస్సు మహబూబ్‌నగర్‌కు వెళుతుంది. లక్ష్మీనారాయణపూర్ సమీపంలోకి రాగానే ఓ వృద్ధురాలు బస్సు దిగేందుకు యత్నిస్తుండగా కిందపడింది. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు బస్సు ముందు అద్దాన్ని పగులగొట్టారు. కాగా అదే మార్గంలో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు వెళుతున్న రూరల్ సీఐ అశోక్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ఘర్షణను సద్దుమణిగించారు.